
నమస్తే తెలంగాణ
జగిత్యాల
3 | కరీంనగర్, బుధవారం 7 మే 2025 | JAGTIAL

కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాల




# మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎక్కడ?

- రోజుల తరబడి విధులకు డుమ్మా
- దెబ్బతింటున్న అడ్మినిస్ట్రేషన్
- వైద్య విద్యార్థులపై పట్టింపు కరువు
- ఎస్ఆర్‌లతోనే క్లాసుల నిర్వహణ
- సర్వత్రా విమర్శలు

**కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రస్తుతం నిర్వహణ సరిగ్గా లేదనే ఆరోపణలు వస్తున్నాయి. రోజుల తరబడి కళాశాల ప్రిన్సిపాల్ విధులకు హాజరు కాకపోవడంతో అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా దెబ్బతిన్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కళాశాలకు హెడ్‌గా ఉన్న ప్రిన్సిపాలే కాలేజీకి గైర్హాజరవడంతో ఇతర సిబ్బంది కూడా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం. ప్రిన్సిపాల్ వచ్చినప్పుడే విధులకు హాజరవుతూ హడావుడి చేస్తున్నట్టు తెలుస్తున్నది. హైదరాబాద్‌లో ఉంటున్న కొంత మంది ఫ్యాకల్టీస్ కూడా విధులకు హాజరు కాకపోవడంతో ఎస్ఆర్‌లతోనే క్లాసులు నిర్వహిస్తున్న పరిస్థితి కనిపిస్తున్నది.**

కరీంనగర్ విద్యానగర్, మే 6 : కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏడాదిన్నర కిందట అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సదుద్దేశాలతో ఏర్పాటు చేసింది. సొంత భవనం లేక పోవడంతో ₹7 కోట్లు వెచ్చింది తాత్కాలిక భవనాన్ని సమకూర్చింది. అందులో తరగతులు నిర్వహిస్తుండగా పక్కా భవనానికి కూడా అప్పటి ప్రభుత్వమే నిధులు మంజూరు చేసింది. ఈ భవనం కూడా నిర్మాణంలో ఉన్నది. ఇంత వరకు బాగానే ఉన్నా బీఆర్ఎస్ ప్రభుత్వం మారిన తర్వాత ఈ కళాశాలను పట్టించుకునే వారు కరువయ్యారు. రెండో సంవత్సరంలోకి అడుగు పెట్టినా ఈ కళాశాలకు సరైన ఫ్యాకల్టీస్ కూడా అందుబాటులో లేరు. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఇంకా మకాం మార్చని ప్రిన్సిపాలే నెలలో ఒకటి రెండు రోజులే విధులకు హాజరవుతున్నారు. దీంతో ఫ్యాకల్టీస్ కూడా విధులకు హాజరు కాకపోవడంతో వైద్య విద్యార్థులకు తరగతుల నిర్వహణ కష్టతరంగా మారింది. సీనియర్ రెసిడెంట్స్ (ఎస్ఆర్)తోనే తరగతులు నిర్వహించాల్సి వస్తున్నది. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉన్నప్పటికీ ఎవరూ సరిగ్గా విధులకు హాజరు కావడం లేదు. ఫ్యాకల్టీస్‌గా ఉన్న చాలా మంది హైదరాబాద్ నుంచే విధులకు హాజరవుతున్నారని తెలుస్తున్నది. వారానికి ఒక రోజు కూడా విధులకు హాజరు కాకపోవడంతో ఎస్ఆర్‌లే వైద్య విద్యార్థులకు బోధిస్తున్నారు.




మూసి ఉన్న ప్రిన్సిపల్ గది




స్టాఫ్, విద్యార్థులకు బయోమెట్రిక్

### జాడ లేని ప్రిన్సిపాల్?

కళాశాలకు పెద్ద దిక్కుగా ఉన్న ప్రిన్సిపాలే సరిగ్గా విధులకు హాజరు కావడం లేదని తెలుస్తున్నది. కళాశాల ప్రారంభంలో ఉన్న ప్రిన్సిపాల్ బదిలీపై వెళ్లడంతో మరొకరిని నియమించారు. అప్పటి నుంచి నెల రెన్నెళ్లు కూడా విధులకు సరిగ్గా హాజరు కాలేదని సమాచారం. ప్రిన్సిపాల్ కుర్చీ ఎప్పుడు చూసినా ఖాళీగానే కనిపిస్తున్నది. అయితే, ఈ ప్రిన్సిపాల్‌కు కొందరు అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది వంత పాడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గత జూన్‌లో చార్జి తీసుకున్న ప్రిన్సిపాల్ నెలలో రెండు, మూడు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నట్లు తెలుస్తున్నది. ప్రిన్సిపాల్‌కు వంత పాడుతున్న సిబ్బంది కూడా విధులకు హాజరు కావడం లేదని సమాచారం. ప్రిన్సిపాల్ విధులకు వస్తున్న రోజునే వీరంతా కళాశాలలో హంగామా చేస్తుంటారని సమాచారం. కొందరు సిబ్బంది వారం పది రోజులకు ఒక సారి విధులకు హాజరవుతూ ఒకేసారి అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆది వారం కూడా సంతకం చేసి ఆ తర్వాత కొట్టేసినట్టు అటెండెన్స్ రిజిస్టర్‌లో కనిపించింది.

### నామమాత్రంగా బయోమెట్రిక్

కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులకు, ఉద్యోగులకు వేర్వేరుగా బయోమెట్రిక్ ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ బయోమెట్రిక్ పెడితేనే విద్యార్థులు తరగతులకు, ఉద్యోగులు విధులకు హాజరైనట్టు నమోదవుతుంది. అయితే, ఇక్కడ ప్రిన్సిపాలే విధులకు హాజరు కాకపోవడంతో బయోమెట్రిక్ గురించి పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. బయోమెట్రిక్ అటెండెన్స్ పరిశీలించి వేతనాలు చేయాలి. కానీ, ఈ కళాశాలలో మాత్రం బయోమెట్రిక్‌తో సంబంధం లేకుండా వేతనాలు ఇస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యం లో డీఎంఈ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. పూర్తిగా పర్యవేక్షణ కొరవడి విద్యార్థులు కూడా నష్టపోతున్నారు. ప్రిన్సిపాల్‌కు సన్నిహితంగా ఉండే ఫ్యాకల్టీస్, సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో కళాశాలలో తరగతుల నిర్వహణతో పాటు అడ్మినిస్ట్రేషన్ కూడా పూర్తిగా దెబ్బతిన్నదనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో బయోమెట్రిక్ యంత్రాలను పరిశీలిస్తే ఎవరు ఏ రోజు విధులకు హాజరవుతున్నారనే విషయాలు తెలిసే అవకాశాలుంటాయి. డీఎంఈ అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకుంటే గానీ కళాశాల గాడిన పడే పరిస్థితి కనిపించడం లేదు.

### దోస్త్ ఆన్‌లైన్ సహాయ కేంద్రం ఏర్పాటు

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, మే 6: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ కే రామకృష్ణ, డీ వరలక్ష్మి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ కోసం రూ.200 చెల్లించి, కళాశాలలో ఉచిత ఆన్‌లైన్ సౌకర్యం వినియోగించుకోవాలన్నారు. మొదటి విడుత ఈ నెల 21 వరకు, వెబ్ ఆప్షన్ 22వ తేదీ వరకు చేసుకోవచ్చన్నారు. మొదటి విడుత సీట్లను 29న విడుదల చేస్తారని వివరించారు. కళాశాలలో చేరాలనుకునే విద్యార్థులకు దోస్త్ అడ్మిషన్లు, ఆన్‌లైన్‌కు సంబంధించి ఏమైనా సందేహాలుంటే కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

**ప్రకృతి ప్రకోపానికి అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి. అకాల వర్షాలు తీవ్ర నష్టాలను మిగుల్చుతున్నాయి. మార్చి, ఏప్రిల్‌లో పడిన అకాల వర్షాలు, వడగండ్లతో ఒక్క పెద్దపల్లి జిల్లాలోనే 3, 566ఎకరాల్లో పంట నష్టం జరుగగా, నెల రోజులైనా సర్కారు స్పందించకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. పరిహారం ఎప్పుడు వస్తుందా? అని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేస్తే పంట చేతికందకుండానే దూరమైందని, కనీసం ప్రభుత్వ సాయం కరువైందని కన్నీటిపర్యంతమవుతున్నారు.**



ధర్మారం మండలం కొత్తూరులో నేలవాలిన మక్క

# పంట నష్టపరిహారమేది?

- పెద్దపల్లి జిల్లాలో 3, 566ఎకరాల్లో పంట నష్టం
- ప్రాథమిక సర్వే చేసి నివేదిక ఇచ్చిన అధికారులు
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- నేటికీ రైతులకు అందని సాయం
- ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు

పెద్దపల్లి, మే 6 (నమస్తే తెలంగాణ) : మార్చి, ఏప్రిల్ నెలల్లో పడిన అకాల వర్షాలకు పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 3,566.23 ఎకరాల్లో దాదాపు ₹3.53 కోట్ల వరకు పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. ఈ యాసంగి పంట మార్చిలో పడిన వర్షాలకు 505.23 ఎకరాల్లో వరి, 642 ఎకరాల్లో మక్క, 27.86 ఎకరాల్లో ఇతర వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. మొత్తంగా మార్చిలో 1175.16 ఎకరాల్లో పంట నష్టం సంభవించింది. అదే విధంగా ఏప్రిల్‌లో పడిన అకాల వర్షాలకు 2391.07 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా, అందులో అత్యధికంగా ముత్తారం మండలంలో 1575 మంది రైతులకు చెందిన 1849.1 ఎకరాలు, ఓదెల మండలంలో 583 మంది రైతులకు చెందిన 428.37ఎకరాల్లో వరి దెబ్బ తిన్నది. ముత్తారం, మంథని, శ్రీరాంపూర్ మండలాల్లోని 113 ఎకరాల్లో మామిడి దెబ్బతిన్నది. జరిగిన నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలను జిల్లా వ్యవసాయ అధికారులు ప్రాథమిక సర్వే చేపట్టి ప్రభుత్వానికి సమర్పించినా పరిహారం పంపిణీ మాత్రం ముందుకు సాగడం లేదు.

### పట్టించుకోని ప్రభుత్వం!

మార్చి 2023లో కురిసిన అకాల వర్షాలకు జిల్లాలోని 10,299 మంది రైతులకు చెందిన 6910ఎకరాల్లో పంట నష్టం జరగగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పరిహారం కింద రూ.6.91కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఆ తర్వాత తిరిగి ఏప్రిల్‌లోనూ అకాల వర్షాలకు కురవగా 17,557 మంది రైతులకు చెందిన 21,948 ఎకరాల్లో పంట నష్టం జరగగా.. ప్రభుత్వం రూ.21.90 కోట్లను విడుదల చేసే క్రమంలోనే ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో అప్పుడు పరిహారం పంపిణీ చేయలేకపోయింది. 2023 డిసెంబర్‌లో ఎన్నికలు జరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా ఆ రూ.21.90 కోట్ల పరిహారాన్ని ఇప్పటి వరకు పంపిణీ చేయ లేదు. దీనికి తోడు తాజాగా, ఈ ఏడాది కురిసిన వర్షాలకు సంబంధించిన పరిహారం పంపిణీలో సైతం నిర్లక్ష్యం చేస్తుండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముత్తారం మండలంలో నేలవాలిన వరి



### అకాల వర్షంతో నష్టపోయినం



నేను మూడెకరాల్లో మక్కేసిన. గత నెలలో కురిసిన వర్షానికి మక్కంతా పడిపోయి నష్టపోయిన. ఇంక కంకి కూడా రాలే. జల్లుమటుకేసింది. మా గ్రామంలో 250 ఎకరాల్లో మక్కేసినం. ఇక్కడ చానా వరకు పంటలు దెబ్బతిన్నై. 25 శాతం పంట దెబ్బ తిన్నది. ఇంకో పది ఇరవై రోజులైతే పంట చేతికి వస్తదనుకున్నం. ఇంతల్నే ఇట్ల జరిగింది. అధికారులు సర్వేలు చేపట్టి పరిహారం ఇస్తామన్నరు. ఇప్పటి వరకు రాలే.

**- పసుంటి సతీశ్, మక్కజొన్న రైతు, కొత్తూరు (ధర్మారం)**

### నిండా మునిగాం..



నేను పదెకరాలు మేల్, ఫిమేల్ వడ్లు పెట్టినం. ఎకరాకు 15 క్వింటాళ్లు వచ్చేది. కానీ, అకాల వర్షం వల్ల సగం దిగుబడే వచ్చింది. పెట్టుబడి పైసలు కూడా నష్టపోయాం. నిండా మునిగిపోయినం. ప్రభుత్వమే మమ్ములను ఆదుకోవాలి.

**- ఐత చంద్రశేఖర్, ఓడేడ్ (ముత్తారం)**

### ప్రభుత్వం ఆదుకోవాలి



అకాల వర్షం వల్ల నాకు చాలా నష్టం జరిగింది. 19 ఎకరాల్లో మేల్, ఫిమేల్ విత్తన వడ్లు పెట్టిన. వర్షం పడే ముందు రెండెకరాలు కోసిన. ఎకరాకు 24 బస్తాల పంట దిగుబడి వచ్చింది. వర్షం పడ్డ తర్వాత ఎకరాకు కేవలం 8 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. ఎకరానికి 10-12 క్వింటాళ్ల నష్టమైంది. క్వింటాలుకు రూ.8 వేల చొప్పున ఒక్కో ఎకరాకు సుమారు రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు నష్టపోయా. ప్రభుత్వం ఆదుకోవాలి.

**- నాంసాని సమ్మయ్య, అడవిశ్రీరాంపూర్ (ముత్తారం)**



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

## రాష్ట్రానికి కేసీఆరే శ్రీరామరక్ష

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, మే 6 : రాష్ట్రానికి బీఆర్ఎస్, కేసీఆరే శ్రీరామరక్ష అని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత స్పష్టం చేశారు. ఆయన అప్పు చేసి తెలంగాణకు సంపద సృష్టించారని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన సంపద.. చేసిన అభివృద్ధి ఏదో చూపించాలని డిమాండ్ చేశారు. అయినా ఒక ఇంటి యాజమాని సక్రమంగా ఉంటేనే ఇల్లు బాగుంటుందని, అలాగే రాష్ట్ర సీఎం బాగుంటేనే ప్రజలు బాగుంటారని చెప్పారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పు చేసి సంపద సృష్టించారని, ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీలు, రైతుబంధు, రైతు బీమా, వృద్ధులకు, మహిళలకు, బీడీ కార్మికులకు పెన్షన్లు, గొర్రెలు, చేప పిల్లలు అందించారని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పదహారు నెలల్లోనే ₹లక్షా 60 వేల కోట్ల అప్పు చేసిందని, అయినా ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదన్నారు. కనీసం కేసీఆర్ నాటిన మొక్కలకు కనీసం నీళ్లు పోసే పరిస్థితి కూడా లేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనలో సర్పంచులకు గౌరవంతో పాటు నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడ్డారని గుర్తు చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచులు లేక కార్యదర్శులు తీవ్ర ఒత్తిడితో పని చేస్తున్నారని, కరెంటు బుగ్గపోతే కొత్తది పెట్టే పరిస్థితి లేదన్నారు. పట్టణ, పల్లె ప్రగతి పేర్లు కాంగ్రెస్ ప్రభుత్వానికి నచ్చకపోతే వేరే పేర్లు పెట్టి అయినా ఆ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని కోరారు. రాష్ట్ర ప్రజలను గాలికి వదిలేసి అందాల పోటీలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈ పోటీలు పల్లె ప్రజల కడుపు నింపుతాయా? అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి లేని నిధులు అందాల పోటీలకు ఎక్కడివని నిలదీశారు. రేవంత్ రెడ్డి పాలన చూస్తుంటే మింగ మెతుకు లేదు కానీ, మీసాలకు సంపంగి నూనె కావాలన్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. ఉద్యోగ సంఘాలతో మాట్లాడిన పద్ధతి చూస్తే రేవంత్‌రెడ్డి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. సమావేశంలో ప్యాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మహేశ్, అర్బన్ మండలాధ్యక్షుడు తుమ్మ గంగాధర్, మాజీ కౌన్సిలర్ దేవేందర్ నాయక్, మాజీ సర్పంచ్‌లు బుర్ర ప్రవీణ్ గౌడ్, తిరుపతి, అంజన్న, పట్టణ ఉపాధ్యక్షుడు వొల్లెం మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మెట్‌పల్లి రూరల్, మే 6: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల డిమాండ్ చేశారు. మెట్‌పల్లి మండలం వెల్లుల్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కేంద్రంలో తమకు ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి, అదనపు కలెక్టర్ లత, డీసీవో మనోజ్‌తో ఫోన్‌లో మాట్లాడి కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత ఉందని రైతులు చెబుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. కేవలం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే హమాలీలే కాకుండా స్థానిక హమాలీలతోనూ పనులు చేయించాలని చెప్పారు. కొనుగోళ్లలో జాప్యం జరిగితే అకాల వర్షాలతో రైతులకు మరింత నష్టం జరుగుతుందని, కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, రైతులు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

## ఉద్యోగులను విలన్లుగా చిత్రీకరించడం సబబేనా?

- తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నేత లక్ష్మారెడ్డి

కరీంనగర్ కలెక్టరేట్, మే 6 : ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలైన పీఆర్సీ, డీఏ అడిగిన పాపానికి ప్రభుత్వోద్యోగులను విలన్లుగా చిత్రీకరించడం ఎంత వరకు సబబు అని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నేత ఎన్ లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. కరీంనగర్ నగరంలోని జ్యోతినగర్‌లోని ఆసంఘం జిల్లా శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో మాట్లాడారు. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగ సంఘాల పాత్ర మరువలేనిదని, ప్రత్యేక పోరులో ఉద్యోగులు చేసిన త్యాగం వెలకట్టలేనిదన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాడు 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారని, ప్రత్యేక ఇంక్రిమెంట్ కూడా విడుదల చేసి ఉద్యోగులపై తనకున్న అభిమానం చాటుకున్నాడని గుర్తు చేశారు. కానీ, రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు వెంటనే విడుదల చేస్తామని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమల్లోకి తెస్తామని, కొత్త పీఆర్సీ అమలు చేస్తామంటూ ప్రకటించి చేతులుదులుపుకొన్నారని మండిపడ్డారు. నేడు వాటిని అమలు చేయాలని అడిగితే శత్రువులుగా చూడడం ఎంత వరకు సమంజసమో చెప్పాలని ప్రశ్నించారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి, తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల ఆగ్రహానికి బలికాకతప్పదని హెచ్చరించారు. ఈసమావేశంలో విశ్రాంత ఉద్యోగ సంఘాల ఐకాస ప్రతినిధులు మల్లెత్తుల శంకర్, బుచ్చిమల్లయ్య, రాక సుధాకర్, సత్యనారాయణ, ఎస్ జనార్దన్‌రావు, నాగుల మల్లయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.



గంగాధర మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

## అకాల వర్షాలతో అన్నదాత ఆగం

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, మే 6 : ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడంతో అకాల వర్షానికి పూర్తిగా తడిసిపోయి అన్నదాతలు ఆగమయ్యారని, ఆరుగాలం చేసిన కష్టం బూడిదలో పోసిన పన్నీరైందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం గంగాధర వ్యవసాయ మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులు ప్రభుత్వ నిర్లక్ష్యంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ధాన్యం విక్రయించి పది రోజులైనా రైతులకు డబ్బులు రావడం లేదని దుయ్యబట్టారు. 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని వ్యవసాయ శాఖ మంత్రి చెప్పిన మాటలు నీటి మూటలుగా మిగిలాయన్నారు. ఇప్పటి వరకు కేవలం 24.43 లక్షల మెట్రిక్ టన్నుల మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. 40 కిలోల 600 గ్రాములకు బదులుగా 42 కిలోల 500 గ్రాములు తూకం వేస్తున్నారని, వెయిట్ లాస్ పేరుతో మిల్లులకు చేరిన ధాన్యానికి మరింత కోత పెడుతున్నారని పేర్కొన్నారు. సకాలంలో టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయిందన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేశారు. ఇక్కడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, నాయకులు కంకణాల విజేందర్‌రెడ్డి, మడ్లపెల్లి గంగాధర్, రామిడి సురేందర్, ముక్కెర మల్లేశం, వడ్లూరి ఆదిమల్లు, మడ్లపెల్లి రమేశ్, మడ్లపెల్లి శ్రీనివాస్, గడ్డం స్వామి, మామిడిపెల్లి అఖిల్ ఉన్నారు.



అర్హులకు ఇండ్లు ఇవ్వాలని పోతుగల్ జీపీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

## 'ఇందిరమ్మ' ఎంపికలో అన్యాయం

- పోతుగల్ జీపీ కార్యాలయం ఎదుట గ్రామస్తుల నిరసన

ముస్తాబాద్, మే 6 : ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక కోసం ప్రభుత్వం కమిటీలు వేసి ఇష్టానుసారంగా లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హులకు అన్యాయం చేస్తున్నదని పోతుగల్ గ్రామానికి చెందిన దరఖాస్తు దారులు మండిపడ్డారు. మంగళవారం పోతుగల్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు తమకు నచ్చిన వారినే ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో ఎంపిక చేస్తున్నారని ఆగ్రహించారు. రోడ్డు వెడల్పులో తమ ఇండ్లు పూర్తిగా పనికి రాకుండా పోయాయని, వర్షం పడితే ఇండ్లలోకి నీరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు అర్హులను గుర్తించి ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శంకరమ్మ, లస్మవ్వ, హంస, శోభ ఎల్లవ్వ, బాబాయి, నరేశ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూల కోసం బారులు తీరిన దరఖాస్తుదారులు

## యువవికాసం.. తిప్పలు

- కోనరావుపేటలో బారులు తీరిన దరఖాస్తుదారులు
- కనీస ఏర్పాట్లు లేక అవస్థలు

కోనరావుపేట, మే 6: రాజీవ్ యువవికాస్ పథకం దరఖాస్తుదారులు తిప్పలు పడ్డారు. మంగళవారం కోనరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూల కోసం బారులు తీరారు. ₹4లక్షల విలువైన యూనిట్ కోసం మండల వ్యాప్తంగా సుమారు 2700మంది దరఖాస్తు చేసుకోగా, 968 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అయితే కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడ్డారు. కార్యాలయం ఎదుట టెంట్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ఎండలో నిరీక్షించారు. చెట్ల కింద కొందరు చిన్నపిల్లలతో గంటల తరబడి పడిగాపులు గాశారు. నీటి వసతి కూడా లేదని మహిళలు మండిపడ్డారు. కూర్చునేందుకు కుర్చీలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ప్రత్యేక కౌంటర్లు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు తాము ఇంటర్వ్యూకు ముందు వచ్చామంటూ ఒకరినొకరు గొడవకు దిగారు. ఏదేమైనా పథకం కోసం దరఖాస్తు చేసుకొంటే ఇంత తిప్పలు ఉంటాయా? అంటూ పలువురు మహిళలు నిరుత్సాహంతో ఇంటికి తిరిగి వెళ్లారు.